సాక్షి
కాకినాడ
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షలు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన పిచ్చుకల నాగేశ్వరరావు, పుష్పలత దంపతులు రూ.రెండు లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు.



విక్రమార్కులు

డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో చాలా మంది మంచి మార్కులు సాధించారు. మెరిట్ జాబితా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.

8లో

మిగులు జలాల విడుదల




ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 4,25,594 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 200, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

తొలి తిరుపతికి తండోపతండాలుగా..

శృంగార వల్లభుని ఆదాయం రూ.2.38 లక్షలు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూల మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,38,048 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 3,500 మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఏపీజీఈఏ



ఏపీ జీఈఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న జిల్లా శాఖ సభ్యులు

అమలాపురం టౌన్: ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఎప్పుడూ అండగా ఉంటుందని జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ అన్నారు. అమలాపురంలోని ముక్తేశ్వరం రోడ్డులో తాలూకా శాఖ అధ్యక్షుడు కె.కామేశ్వరరావు అధ్యక్షతన ఏపీజీఈఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బాపూజీ మాట్లాడుతూ జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీజీఈఏ చేస్తున్న కృషిని వివరించారు. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంఘంగా ఏర్పడిన అనతి కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగుల సభ్యత్వం కలిగిన ఏకైక సంఘంగా సేవలు అందిస్తోందన్నారు. అనంతరం నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బిల్లులు ఇవ్వాలని, ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని సమావేశం డిమాండ్ చేసింది. సంఘ జిల్లా కోశాధికారి జేఏ రాజ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్‌కుమార్, సూర్యనారాయణ, రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుళ్లపల్లి ఘనపాఠికి రాజాలక్ష్మి పురస్కారం ప్రదానం



గుళ్లపల్లి సీతారామ చంద్ర ఘనపాఠి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం శివారు కొంతమూరులోని దత్తాత్రేయ వేదవిద్య గురుకులం గౌరవాధ్యక్షుడు, ప్రధాన ఆచార్యుడు గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోనున్నారు. చెన్నైకి చెందిన రమణయ్య రాజా 1979 నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులకు రాజాలక్ష్మి అవార్డులను అందజేస్తున్నారు. ఈ మేరకు వేదవిద్య ప్రచారానికి గుళ్లపల్లి ఘనపాఠి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆదివారం ఉదయం 11.30 గంటలకు వేదవిద్య గురుకులం ప్రాంగణంలో ఈ అవార్డును అందజేయనున్నారు. సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. సంస్థ రజతోత్సవ సందర్భంలో ఈ అవార్డును అందుకోవడం దత్తాత్రేయుని ఆశీస్సులుగా భావిస్తున్నానని సీతారామచంద్ర ఘనపాఠి తెలిపారు. గురుకులం కార్యవర్గం తరపున భాగవత విరించి డాక్టర్ టీవీ నారాయణరావు ఈ వివరాలు తెలిపారు.

శ్రీఖండ్ కైలాష్ మహాదేవ్ యాత్ర



శ్రీఖండ్ యాత్రకు వెళ్లిన కొంకుదురు యువకులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు చెందిన నలుగురు యువకులు శ్రీఖండ్ కైలాష్ మహాదేవ్ యాత్ర పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చారు. పంచ కైలాసాలలో ఒకటిగా భావించే ఈ ప్రదేశం హిమాచల్ ప్రదేశ్‌లో సముద్ర మట్టానికి 18,570 అడుగుల ఎత్తులో ఉంది. పోతంశెట్టి మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నం వెంకటరెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, కర్రి ఉమామహేశ్వరరెడ్డి, పడాల వెంకటరెడ్డి ఈ యాత్రను చేసి 72 అడుగుల పర్వత లింగాన్ని దర్శించుకున్నారు.

పండగ నుంచి దండగ వైపు..

- పేరుకే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు
- అమలుకు నోచుకోని ప్రభుత్వ పథకాలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోతున్న వైనం
- రుణాల కోసం ఆశగా ఎదురుచూపులు

భూములున్నవారంతా సాగుదారులనీ కాదు.. సాగుదారులందరూ భూస్వాములు కావాలనీ లేదు. ఆ ఇరువర్గాల బంధం అనాదిగా ఎంతో బలమైనదీ.. అదే క్రమంలో సున్నితమైనదీ. నమ్మకం ప్రాతిపదికన సాగే ఈ పవిత్ర బంధంలో నిజాయితీగా చెప్పాలంటే కష్టం కచ్చితంగా సాగుదారుదే. పంట దిగుబడి బాగుంటే లాభంలో వాటా తీసుకునే భూస్వామి.. నష్టపోతే మాత్రం కిమ్మనని పరిస్థితి. పైగా కచ్చితంగా కౌలు వసూలుచేస్తుంటారు. ఈ క్రమంలో కౌలు రైతుల కష్టాన్ని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూస్వామికి ఏమాత్రం నష్టం కలగని రీతిలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చింది. వారికి సాగుహక్కు గుర్తింపు కార్డులు అందజేసి పెట్టుబడి సాయం.. ప్రకృతి సహకరించక పంట నష్టపోతే పరిహారం.. సాగులో మెళకువలు, విత్తనం నుంచి విక్రయం వరకు ఎన్నో ప్రయోజనాలు చేకూరేలా విధివిధానాలు రూపొందించింది. దీంతో ఆ ప్రభుత్వంలో ఐదేళ్లూ సాగును పండగలా చేసుకున్నారు. ఇంతలోనే ప్రభుత్వం మారింది. గతంలో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మళ్లీ గద్దెనెక్కారు. దీంతో మళ్లీ కౌలు రైతులకు పాతకష్టాలు మొదలయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలనే ఇస్తున్నట్టు కలరింగ్ ఇస్తూ వాటికి వెచ్చించాల్సిన నిధులు మాత్రం పైసా కూడా విదల్చడం లేదు. దీంతో కౌలు రైతులు ఏ పనులూ మొదలుపెట్టలేక.. రుణాల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద చేతులు చాస్తూ నానా అగచాట్లు పడుతున్నారు.

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కూటమి ప్రభుత్వం హయాంలో తమకు తీరని అన్యాయం జరుగుతోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండగగా సాగిన తమకు ఈ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని వారు అంటున్నారు. గ్రామ స్థాయిలో విత్తనం మొదలు విక్రయం వరకూ ప్రభుత్వ సేవలన్నీ రైతుల చెంతకే వచ్చేవి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. కౌలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతుల గుర్తింపు విషయంలో జాప్యం చోటుచేసుకోవడం వల్ల వారికి ఎరువులు, విత్తనాలు అందడం లేదు. మరోవైపు బ్యాంకుల నుంచి పెట్టుబడి రుణాలు సైతం అందడం లేదు. దీంతో ఈ ఏడాదికి కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం మొండి చూపుతున్నట్టే అనుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు కానీ అవి నిరుపయోగంగా మారాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వాటి ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఈ సీజన్ ముగిసినా ఒక్క కౌలు రైతుకు కూడా నయా పైసా రుణం ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రస్తుతం రబీ సీజన్ మొదలై నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకూ వారికి ఈ ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహాయం అందలేదు. దీంతో కౌలు రైతులు బయట వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గుర్తింపు కార్డుతో సరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో 35 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. కానీ వారికి ప్రభుత్వం నుంచి ఒక్క పథకం కూడా దక్కలేదు. గత ఏడాది కౌలు రైతులకు పంట నష్ట పరిహారం కానీ, బ్యాంకులో రుణం కానీ ఇవ్వలేదు. దీంతో వారంతా గత ప్రభుత్వంలోనే తమకు ఎంతో మేలు జరిగిందని, ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆనాటి సేవలను గుర్తుచేసుకుంటున్నారు.



కొత్తపల్లి మండలంలో కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందిస్తున్న అధికారులు (ఫైల్)

సంవత్సరం	కౌలు కార్డులు	ఇచ్చిన రుణాలు (రూ.కోట్లలో)
2020-21	36,795	18.73
2021-22	44,580	47.17
2022-23	41,322	46.46
2023-24	56,399	53.80

అప్పుల పాలవుతున్న కౌలు రైతులు

ప్రస్తుతం ఎకరా భూమి సాగు చేసుకోవాలంటే యజమానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకూ కౌలు చెల్లించాలి. ఆ మొత్తం చెల్లించిన అనంతరమే కౌలు రైతులు సాగులోకి వెళతారు. విత్తనాల కొనుగోలు మొదలు, పంట దమ్ము, వరి నాట్లు వేయడం, ఎరువులు, పురుగు మందులు ఇలా అన్నింటికీ మరో రూ.25 వేలు పైబడి పెట్టుబడి అవసరం ఉంటుంది. ఈ మేరకు ఒక ఎకరం భూమి కౌలు చేయాలంటే రూ. 50 వేలు అవసరం ఉంటుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డు ఉన్న ప్రతి రైతుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ఎటువంటి హామీ లేకుండా పంట రుణాలు ఇచ్చేవారు. ప్రస్తుతం గుర్తింపు కార్డులు ఇచ్చినప్పటికీ ఎటువంటి రుణాలు ఇవ్వకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కౌలు రైతులు బయట వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుకోవడంతో వచ్చిన పంట అంతా కౌలుకు, పెట్టుబడి రుణాలు, వాటికి వడ్డీలకే పోతోందని అంటున్నారు. అదే ప్రభుత్వం నుంచి బ్యాంకుల్లో రుణాలు ఇస్తే తక్కువ వడ్డీ కావడంతో తమకు ఆ మొత్తమైనా మిగిలేదని రైతులు అంటున్నారు.

కౌలు రైతులకు నాడు ఎంతో 'భరోసా'

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేసేవారు. నిరుపేద కౌలు రైతులైన ఎస్సీ, బీసీలకు వైఎస్సార్ రైతు భరోసా కింద ఐదేళ్ల పాటు వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. రైతులకు ఇచ్చినట్టే ప్రతి కౌలు రైతుకు ఏడాదికి రూ.13,500 వారి ఖాతాల్లో జమ చేశారు. వీటితో పాటు పంట నష్ట పరిహారం కూడా వారికి అందించేవారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బ తింటే ఆ నష్ట పరిహారం సైతం అందే విధంగా నాటి పాలకులు చర్యలు తీసుకున్నారు. కానీ గత నెలలో కురిసిన వర్షాలకు భారీగా పంట నష్టం జరిగినా కౌలు రైతులకు ఎక్కడా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేవలం భూ సర్వే నెంబర్ల ఆధారంగా ఆయా రైతుల ఖాతాల్లో పంట నష్ట పరిహారం జమ కావడంతో భూయజమానులు ఆ పరిహారాన్ని కౌలు రైతులకు ఇచ్చేందుకు ససేమిరా అన్నారు. పంట నష్టపోయినా ప్రతి ఎకరాకు రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేసింది కానీ కౌలు రైతులకు మొండి చెయ్యి చూపింది. దీంతో పంట నష్టపోయి, ఇచ్చిన కౌలు మొత్తం కూడా రాకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోయారు. అయినప్పటికీ ఈ కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు.

ఎందుకూ ఉపయోగపడడంలేదు



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. వారందరికీ రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాలు అందించి, పంట రుణాలు అందజేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా ఇంత వరకూ తమకు ఇచ్చిందేమీ లేదు. నాయకుల హామీ కోసం ఎదురుచూడటమే కానీ వీసమెత్తు ప్రయోజనం కనబడటంలేదు. గుర్తింపు కార్డులు నాలుక గీసుకోవడానికి కూడా ఉపయోగపడటంలేదు.

– మార్శెట్టి వెంకటరమణ, కౌలురైతు, యండమూరు, కరప మండలం

కౌలు రైతు మాటే లేదు



కూటమి ప్రభుత్వం కౌలు రైతులను అసలు పట్టించుకోవడం లేదు. నాలుగేళ్లుగా 4 ఎకరాలు భూమిని కౌలుకు చేస్తున్నాను. ఇప్పటికీ కౌలు కార్డు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. కార్డు అడిగితే నేను కౌలుకు తీసుకున్న భూమి నీటి తీరువా వడ్డీతో చెల్లించాలని అధికారులు ఇబ్బంది పెడుతున్నారు.

– ఇంటి వెంకటరావు, కౌలు రైతు వీకే రాయపురం, సామర్లకోట మండలం

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని వ్యతిరేకించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. అలా తిరుగుబాటు చేసిన ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని చెప్పారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం వచ్చాక అమాంతంగా పెరిగిన విద్యుత్ బిల్లులకు తోడు స్మార్ట్ మీటర్లతో మరింత భారం పడుతుందన్నారు. వినియోగదారుడి అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించకూడదని సంబంధిత కంపెనీలు ప్రభుత్వానికి ఇచ్చిన నిబంధనల్లో స్పష్టంగా ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి విద్యుత్ శాఖ అధికారులు బలవంతంగా ఆదాని స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని ఆరోపించారు. తక్కువ వాడే విద్యుత్ వినియోగదారుడికి గతంలో రూ.వందల్లో బిల్లు వస్తే ఈ స్మార్ట్ మీటర్లు బిగించాక రూ.వేలల్లో వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. గతంలో విద్యుత్ బిల్లులు పెంచి కొన్ని పార్టీలు పతనానికి గురయ్యాయని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. నేడు అలాంటి పరిస్థితిని కూటమి ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ స్మార్ట్ మోసాలపై త్వరలోనే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సమావేశాలు, డోర్ టూ డోర్ కాంపెయిన్ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఓటు హక్కును హరించిన 'కూటమి'

కడప జిల్లా పులివెందల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పోలీసు తుపాకీలతో ఓటు హరించేలా చేసిందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. ఓటు హక్కును లేకుండా చేయడం అంటే ప్రజాస్వామానికి తూట్లు పొడిచినట్లేనని చెప్పారు. ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్య ద్రోహమేనన్నారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్లే లేకుండా, ఓటర్లకు ఓటును వినియోగించుకునే అవకాశమే ఇవ్వకుండా గెలిచిన గెలుపు అసలు గెలుపే కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వ తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, ఉమ్మడి జిల్లా పార్టీ లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, నాయకులు ముంగర ప్రసాద్, దండుమేను రూపేష్, కుడుపూడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పంపాకు భారీగా వరద నీరు

- వంద అడుగులకు చేరిన నీటిమట్టం
- ముందు జాగ్రత్తగా 500 క్యూసెక్కుల విడుదల

అన్నవరం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్థానిక 'పంపా' రిజర్వాయర్ నీటిమట్టం శనివారానికి వంద అడుగులకు చేరుకుంది. పంపా గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు. పంపా క్యాచ్‌మెంట్ ఏరియా శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల రిజర్వాయర్‌లోకి 500 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ముందు జాగ్రత్తగా బ్యారేజీ నాలుగో నెంబర్ గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీరు సముద్రానికి విడుదల చేస్తున్నారు. పంపా ఆయకట్టుకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సబ్సిడరీ డ్యామ్ ద్వారా 20 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటి నిల్వ 0.43 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.30 టీఎంసీ నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నిల్వ ఉంచే పరిస్థితి లేదు

పంపా బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడంతో రిజర్వాయర్‌లో నీటిని 99 అడుగులకు మించి నిల్వచేసే పరిస్థితి లేదు. అంతకన్నా ఎక్కువ నీటిని నిల్వచేస్తే గేట్ల నిర్వహణ కష్టంగా ఉంటుందని, ఒకవేళ జరగరానిది జరిగి గేట్లు కొట్టుకుపోతే దిగువన పొలాలు, గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు.



పంట కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు

నీటిమట్టం పెరిగితే మరింత విడుదల : ఈఈ శేషగిరిరావు

పంపా రిజర్వాయర్ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నాం. 99 అడుగులపైకి వచ్చిన నీటిని సముద్రానికి విడుదల చేస్తాం. ప్రస్తుతం వంద అడుగుల నీటిమట్టం ఉంది. ఆదివారం ఉదయానికి 99 అడుగులకు చేరే అవకాశం ఉంది. తొండంగి, శంఖవరం మండలాల తహసీల్దార్లకు పరిస్థితి వివరించాము. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

రత్నగిరిపై కృష్ణాష్టమి వేడుక

సప్తగోకులంలో నల్లనయ్యకు ప్రత్యేక పూజలు

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారి సన్నిధిలో గోపూజోత్సవం, రాత్రి ఉట్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు రామరాయ కళావేదికపై సత్యదేవుడు అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేసిన అనంతరం గోపూజోత్సవం నిర్వహించారు. అనంతరం గోవులకు బెల్లం, బియ్యం తినిపించారు. తరువాత భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం వేదపండితులు గొల్లాపల్లి ఘనపాఠి, గంగబాబు, యనమండ్ర ఘనపాఠీ, శివ ఘనాపాఠి, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకుడు దత్తాత్రేయశర్మ, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు చామర్తి కన్నబాబు తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి ఏడు గంటలకు సత్యదేవుడు అమ్మవార్లను ఊరేగింపుగా రామాలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజల అనంతరం ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగోకులానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సప్తగోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి అర్చకుడు కంచిభట్ల వరదయ్య, పరిచారకుల పూజలు చేశారు. గోకులాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు, నవదంపతులు



శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా రత్నగిరిపై గోపూజ చేస్తున్న భక్తులు

వరుస సెలవులతో భక్తజన సంద్రం

వరుస సెలవులతో రత్నగిరి భక్తులతో పోటెత్తింది. స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి, శని, ఆదివారాలు కలసిరావడంతో రత్నగిరి భక్తజన సంద్రమైంది. శనివారం 50 వేల మంది స్వామివారిని దర్శించారు. దీంతో ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత మండపాలు కిటకిటలాడాయి. స్వామివారి వ్రతాలు నాలుగు వేల జరిగాయని, స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టిందని అధికారులు తెలిపారు. అన్ని విభాగాల ద్వారా రూ.50 లక్షల ఆదాయం వచ్చిందని, నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు వారు తెలిపారు. కాగా వర్షం వల్ల స్వామివారి ప్రాకార సేవ గోపురం లోపలే నిర్వహించారు.



సప్తగోకులంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు



రామాలయం వద్ద ఉట్టి కొడుతున్న భక్తులు

క్లుప్తంగా

ఉత్సాహంగా హ్యాండ్ బాల్ పోటీలు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రాజానగరం: దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సీబీఎస్‌ఈ సౌత్ జోన్ -1 హ్యాండ్ బాల్ పోటీలలో క్రీడాకారులు హోరాహోరిగా తలపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం జరిగిన పోటీలలో అండర్ - 14 విభాగంలో చెరక్ ఇంటర్నేషనల్ (హైదరాబాద్), ఆర్‌జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ (నంద్యాల), హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హైదరాబాద్), ఏకశిల హైస్కూల్, అలాగే అండర్ - 17 విభాగంలో రైల్వే హయ్యర్ సెకండరీ స్కూల్ (మధురై), వెలమలై విద్యాలయం (చెన్నై), అండర్- 19 విభాగంలో వెలమలై విద్యాలయం (చెన్నై) విద్యార్థులు విజయం సాధించారు. పోటీలకు డాక్టర్ ఎస్. గోపికృష్ణ రిఫరీగా వ్యవహరించారు. సోమవారం వరకు జరిగే ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ నుంచి 1200 మంది క్రీడాకారులు, 120 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారని స్పోర్ట్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.స్వామి తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయ ప్రకాష్, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూలీలపై అడవి పంది దాడి


బాధితుడి చేతికి అయిన గాయాలు

ఐ.పోలవరం: గ్రామ పరిధిలోని పొలాల్లో పని చేస్తున్న కూలీలపై శనివారం అడవి పంది దాడి చేసింది. ఈ ఘటనలో దంగుడుబియ్యం రాజారావు, గుత్తుల త్రివేణి పద్మావతి, బొలిశెట్టి రాంబాబు, దంగేటి వెంకట్రావుకు గాయాలయ్యాయి. వారిని టి.కొత్తపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వీరిలో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


బుల్లి వెంకన్న (ఫైల్)

గోపాలపురం: ప్రమాదవశాత్తూ చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పి.మనోహర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెంకి చెందిన ఏసులంక బుల్లి వెంకన్న (39) తన పొలానికి వెళ్లే క్రమంలో బాలింక చెరువు దాటుతూ ప్రమాదవశాత్తూ కాలు జారి పడిపోయాడు. అతడికి ఈత రాకపోవడంతో చెరువులో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విక్రమార్కులు

- డీఎస్సీలో అభ్యర్థుల ప్రతిభ
- ఉత్తమ ఫలితాల సాధన
- మెరిట్ లిస్ట్ కోసం ఎదురు చూపులు
- ఉపాధ్యాయ కొలువుపై ఆశలు
- ఉమ్మడి జిల్లాలో 1,241 పోస్టులు


డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

రాయవరం: ఇటీవల జరిగిన డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) 2025 పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో చాలా మంది మంచి మార్కులు సాధించారు. తమకు తప్పకుండా ఉపాధ్యాయ కొలువు లభిస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇదే సందర్భంలో మిగిలిన వారికి ఎన్ని మార్కులు వచ్చాయన్న అంశంపై ఆరా తీస్తున్నారు. డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన స్కోర్ కార్డులను ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నేపథ్యంలో టీచర్ కొలువు దక్కడంలో ఎవరికెంత అవకాశం ఉందన్న అంశంపై నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. తాము పొందిన మార్కులకు ఉద్యోగం వస్తుందా అనే ఆలోచనలో ఉన్నారు. ఇంకా మెరిట్ లిస్ట్ రానందున తమకు తెలిసిన వారికి ఫోన్లు చేసి మార్కులపై ఆరా తీస్తున్నారు.

ఇదీ పరిస్థితి

పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ తదితర యాజమాన్యాలకు సంబంధించి 1,241 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 63,004 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38,617 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీటిలో ఎస్‌జీటీ పోస్టులు 423, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 818 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధికంగా ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆ తర్వాత సోషల్, బయాలజీ ఖాళీలు ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులు కేవలం రెండంకెల్లో ఖాళీలున్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో ఎస్ఏ (పీఎస్) 03, ఎస్ఏ (బీఎస్) 04, ఎస్ఏ (పీఈ) 01, ఎస్‌జీటీ పోస్టులు 104 ఖాళీలున్నాయి. ఇవి కాకుండా జోన్-2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ / ట్రైబల్ (గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 03, పీఈటీ 24 పోస్టులు భర్తీ చేయనున్నారు.

అప్పుడే అభ్యర్థులకు స్పష్టత

నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు మెరిట్ జాబితా కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 1,241 ఖాళీలకు డీఎస్సీని ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు 10 నెలల అనంతరం ఈ నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షలు రాసి స్కోర్ కార్డులు పొందిన వారు మెరిట్ లిస్ట్ ప్రకటనకు వేచి చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా మెరిట్ లిస్ట్ పూర్వపు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రావాల్సి ఉంది. ఆ జాబితా వచ్చిన తర్వాత సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. అయితే సాంకేతిక కారణాలతో మెరిట్ లిస్ట్ విడుదలలో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు సమాచారం. ఆ జాబితా వచ్చిన తర్వాతే ఉద్యోగం వచ్చే విషయంపై అభ్యర్థులకు స్పష్టత వస్తుంది.

ఖాళీల వివరాలు

కేటగిరి	ప్రభుత్వ/జెడ్పీ/మున్సిపల్ మేనేజ్‌మెంట్లు	
ఎస్‌జీటీ		423
ఎస్ఏ	తెలుగు	65
ఎస్ఏ	హిందీ	78
ఎస్ఏ	ఇంగ్లీష్	95
ఎస్ఏ	గణితం	64
ఎస్ఏ	పీఎస్	71
ఎస్ఏ	బయాలజీ	103
ఎస్ఏ	సోషల్	132
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	210
మొత్తం		1,241

ఎప్పుడు వస్తుందా అని..



ముమ్మిడివరం మండలం మల్లయ్యపాలెం ఎంపీపీ స్కూల్లో ఎస్‌జీటీ పనిచేస్తూ డీఎస్సీ 2025 పరీక్షలో ఫిజికల్ సైన్స్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు 82 మార్కులు సాధించాను. ఆన్‌లైన్‌లో స్కోర్ కార్డు పొందాను. మెరిట్ లిస్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. – బి.శివ గణేష్, ఎస్‌జీటీ, ద్రాక్షారామం, రామచంద్రపురం మండలం

మంచి ర్యాంకు సాధించాను



తెలంగాణ డీఎస్సీ 2024లో పరీక్ష రాసి మిర్యాలగూడలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నాను. డీఎస్సీ 2025 పరీక్షల్లో ఎస్‌జీటీ విభాగంలో 87.7 మార్కులు సాధించాను. మెరిట్ జాబితా కోసం ఎదురు చూస్తున్నాను. మా నాన్న మట్టపర్తి వెంకట రాంబాబు కొత్తలంక మోడల్ ప్రైమరీలో పీఎస్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. నాన్న స్ఫూర్తితో ఉద్యోగం సాధించాను.
– మట్టపర్తి సౌమ్య, ముమ్మిడివరం

త్వరగా ప్రకటించాలి



డీఎస్సీ 2025 పరీక్షలో ఎస్‌జీటీ విభాగంలో 87.2 మార్కులు సాధించాను. రైతు కుటుంబం నుంచి వచ్చిన నేను టీచర్ కొలువు సాధించాలనే పట్టుదలతో చదివాను. మెరిట్ జాబితా కోసం వేచి చూస్తున్నాను. అధికారులు మెరిట్ జాబితాను ప్రకటించాలి.
– బద్రి అంజలి దేవిక, అంద్రంగి, కాజులూరు మండలం

ప్రాణదాతలూ స్పందించండి

- సికిల్ సెల్ వ్యాధితో బాలిక అవస్థలు
- వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు
- సాయం కోరుతున్న తల్లిదండ్రులు

కపిలేశ్వరపురం (మండపేట): ఆడుతూ పాడుతూ తిరగాల్సిన సమయంలో ఆ పాప మంచాన పడింది. తోటి స్నేహితులతో ఆనందంగా గడపాల్సిన సమయంలో జ్వరం, నీరసం, ఒళ్లనొప్పులతో బాధపడుతోంది. ఆ బాలిక వైద్య చికిత్సకు సాయం చేయాలని దాతలను తల్లిదండ్రులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండపేట పట్టణంలోని 26వ వార్డు గాంధీ నగర్ కోలావారి తోట ప్రాంతానికి చెందిన నీలాపు అమృత వర్షిణి సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతోంది. ఆమె తండ్రి ఈశ్వరరావు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు. తల్లి అనురాధ గృహిణి. అమృత వర్షిణి నాలుగో తరగతి, కుమారుడు రామ్‌తేజ్ దామోదర కుమార్ ఏడో తరగతి చదువుతున్నారు. 2016 సెప్టెంబర్‌లో పుట్టిన కుమార్తె అమృత వర్షిణి సుమారు నాలుగేళ్లుగా ఆ వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు ఆరో సంవత్సరం ప్రారంభంలో ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో ఈ సమస్య ప్రారంభమైంది. మొదట్లో మండపేట, రాజమహేంద్రవరాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించారు. అనంతరం వైజాగ్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపించగా సికిల్ సెల్ ఎనీమియాగా నిర్ధారించారు. దీంతో 2022లో తమిళనాడు వెల్లూరులోని సీఎంసీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకు వెళుతున్నారు. వెళ్లిన ప్రతిసారీ వైద్యానికి సుమారు రూ.20 వేలు ఖర్చవుతోంది. ఆరు నెలలకు ఒక్కసారి రక్తం ఎక్కించాల్సి వస్తోంది. దాతలు సమకూరనప్పుడు తండ్రి ఈశ్వరరావు తన రక్తాన్ని దానం చేసి ప్రత్యామ్నాయంగా పాప గ్రూపునకు చెందిన రక్తాన్ని తీసుకుంటున్నారు. ఈశ్వరరావు మున్సిపాలిటీలో శానిటరీ వర్కర్‌గా నమోదు కావడంతో కుటుంబానికి ప్రభుత్వ సాయం అందడం లేదు. దీంతో బాలిక చికిత్సకు దాతలు సహకారం అందించాలని కోరుతున్నారు. వివరాలకు 80087 88195 నంబర్‌ను సంప్రదించవచ్చు.


సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న అమృత వర్షిణి

మద్యానికి డబ్బులివ్వలేదని భార్యపై దాడి

బిక్కవోలు: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదంటూ భార్యపై ఓ వ్యక్తి దాడి చేశాడు. బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన కంచెర్ల దేవి, ఆమె భర్త చిట్టిబాబు, పిల్లలతో కలిసి పందలపాక సరిపల్లిపేటలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో చిట్టిబాబు మద్యం తాగడానికి డబ్బులు కావాలని భార్యను అడిగాడు. ఆమె నిరాకరించడంతో వెనుక నుంచి సుత్తితో తలపై కొట్టాడు. దీంతో తీవ్రగాయాల పాలైన దేవిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హైవేపై ఆయిల్ మాఫియా


మల్లేపల్లిలోని ఓ ప్రాంతంలో అక్రమ ఆయిల్ వ్యాపారం కోసం రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన పీపా, డబ్బా


ట్రాలీ ఆయిల్ ట్యాంక్ నుంచి డీజిల్‌ను తీస్తున్న దృశ్యం


- లారీ డ్రైవర్ల నుంచి అక్రమంగా డీజిల్ కొనుగోలు
- లాభం వేసుకుని ఇతర లారీలకు విక్రయం
- అక్రమార్కుల ధనార్జన

గండేపల్లి: స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారిపై ఆయిల్ మాఫియాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఆయిల్ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. పలు జిల్లాలు, రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఈ జాతీయ రహదారిపై పలు శాఖల చెందిన అధికారులు ప్రయాణిస్తుంటారు. అయినప్పటికీ అక్రమార్కులు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. చెన్నై, విజయవాడ, కోల్‌కతా, విశాఖపట్నం తదితర నగరాలకు ఎగుమతులు, దిగుమతుల కోసం నిత్యం వందల లారీలు హైవేపై ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో లారీ యజమానులు లారీలకు ఆయిల్‌ను ఫుల్ ట్యాంక్ చేయించి సరకు ఎగుమతులు, దిగుమతుల కోసం గమ్యస్థానాలకు పంపుతారు. ఒక్కొక్కసారి డ్రైవర్లే ఆయిల్‌ను ఫుల్ ట్యాంక్ చేయించుకుంటారు. అయితే గమ్యస్థానాలకు వెళుతుండగా మధ్యలో లారీ డ్రైవర్, క్లీనర్ ఒక్కటై.. ట్యాంక్‌లో డీజిల్‌ను అక్రమంగా తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

యథేచ్ఛగా వ్యాపారం

మల్లేపల్లిలో ఈ డీజిల్ అక్రమ వ్యాపారం కొంత కాలంగా పెద్ద ఎత్తున జరుగుతున్నట్టు తెలుస్తోంది. లారీ డ్రైవర్, క్లీనర్ల నుంచి డీజిల్‌ను కొందరు వ్యాపారులు అక్రమంగా కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం పెట్రోల్ బంకుల వద్ద ఒక లీటర్ డీజిల్‌ను రూ.96.74కి విక్రయిస్తుండగా, ఆయిల్ మాఫియా నిర్వాహకులు.. లారీల వద్ద రూ.75కు కొనుగోలు చేస్తున్నారు. ఆ డీజిల్‌ను ఇతర లారీలకు రూ.85కి విక్రయిస్తున్నట్టుగా తెలుస్తోంది. దాబా, టీ షాపుల వద్ద డ్రైవర్లు టీ తాగేందుకు, టిఫిన్, భోజనం నిమిత్తం ఆగుతుండటంతో ఆ ప్రాంతంలోనే ఈ వ్యాపారం కొనసాగుతోంది. కొన్నిసార్లు రహదారిపైనే వాహనాలను నిలిపి ఆయిల్‌ను బయటకు తీసే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. అక్రమంగా డీజిల్ విక్రయించిన లారీ డ్రైవర్లకు కొందరు వ్యాపారులు డబ్బులకు బదులు మద్యం సీసాలను ఇస్తున్నట్టు సమాచారం.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జి.మామిడాడకు చెందిన వ్యాపారవేత్త మల్లిడి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జి.మామిడాడ లలిత నగర్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వ్యాపారవేత్తలు మల్లిడి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ల రామచంద్రారెడ్డి, సబ్బెళ్ల లక్ష్మణరెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది బాలురు, బాలికలు హాజరయ్యారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు సెప్టెంబర్‌లో అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికలకు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పీడీ నల్లమిల్లి అప్పారెడ్డి, పీఈటీ జె.మోహన్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు, అధ్యక్షుడు ముప్పన వీరభద్రస్వామి, కార్యదర్శి సీతాపతిరావు, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్‌అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ సూరిబాబు పాల్గొన్నారు.


పోలవరం సమస్యలపై చిత్తశుద్ధి లేదు


రాజమహేంద్రవరం విమానాశ్రయంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి తదితరులు

కోరుకొండ: పోలవరం ప్రాజెక్టుకు భూములు, ఆస్తులు ఇచ్చి, నిర్వాసితులైన వారి సమస్యల పరిష్కారం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి అన్నారు. ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల పరిశీలన కోసం తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పర్యటన నిమిత్తం ఇండిగో విమాన సర్వీసులో శనివారం ఉదయం ఆయన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చారు. ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు, సీపీఎం ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ కూడా ఉన్నారు. వీరికి ఆ పార్టీ నాయకత్వం, శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్నా నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు. ఆదివాసీ రైతులు, నిర్వాసితుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి వచ్చామన్నారు. ప్రాజెక్టు కారణంగా 1.06 లక్షల కుటుంబాలు నిర్వాసితులయ్యాయని, వీరిలో 80 శాతం ఆదివాసీలే ఉన్నారన్నారు. వీరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకారం రూ.33 వేల కోట్లు రావాల్సి ఉండగా, ఆ మేరకు నిధులు విడుదల చేయలేదని ఆయన తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై పార్లమెంటులో చర్చను లేవనెత్తుతున్నానన్నారు. కార్యక్రమంలో పార్టీ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి. అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లాకార్యదర్శి బి. కిరణ్, కార్యదర్శివర్గసభ్యులు తులసి, పవన్, రాంబాబు, నాయకులు ఎస్‌ఎస్ మూర్తి, సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తవత్సలా గోవిందా


వాడపల్లి క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

- వాడపల్లికి పోటెత్తిన భక్తులు
- ఒక్కరోజే రూ.60 లక్షల ఆదాయం

కొత్తపేట: భక్తవత్సలా గోవిందా.. భాగవతాప్రియ గోవిందా అంటూ ఆ శ్రీనివాసుడిని స్మరిస్తూ భక్తజనం మురిసింది. కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. గౌతమీ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, భారీ క్యూ లైన్లలో బారులు తీరారు. అనేక మంది భక్తులు తలనీలాలను సమర్పించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం సుగంధ పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. భక్తుల విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, వేదాశీర్వచనం, ఆన్‌లైన్, నిత్య, శాశ్వత అన్నదానం విరాళాలు, లడ్డూ విక్రయం ద్వారా దేవస్థానానికి ఒక్కరోజే రూ.60,17,243 వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము వాడపల్లిలో ట్రాఫిక్ నియంత్రించి, ఆలయ ఆవరణలో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఏపీఎస్ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లి ఆలయానికి బస్సు సర్వీసులను నడిపింది. కాగా.. ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి నిర్వహించిన బాలికల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. న్యూఢిల్లీ ఫౌండేషన్ ఫోర్ డెవలప్ ఇండియా కళాశాలకు చెందిన కళాకారులు కూచిపూడి నృత్యం చేశారు.

స్వదేశానికి దుబాయ్ బాధితుడు

- ఏజెంట్ మోసంతో అంబాజీపేట వాసి అవస్థలు
- ఇండియాకు తీసుకువచ్చిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు


కనకరాజు

అమలాపురం రూరల్: నకిలీ ఏజెంట్ మోసంతో దుబాయ్‌లో ఇబ్బందులు పడుతున్న అంబాజీపేట చెందిన ఒక యువకుడిని భారత విదేశీయ రాయబార మంత్రిత్వ శాఖ సహకారంతో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు ఇండియాకు తీసుకునివచ్చారు. వివరాల్లోకి వెళితే.. అంబాజీపేట చెందిన పొన్నాడ మంగ కుమారుడు కనకరాజును ఒక ఏజెంట్ ఇటీవల దుబాయ్‌కు పంపించాడు. అక్కడ నెలకు రూ.50 వేలకు పైగా జీతం వస్తుందని, రోజుకు 8 గంటలు పని ఉంటుందని చెప్పాడు. కానీ అక్కడ కనకరాజుకు భిన్నమైన పరిస్థితులు ఎదురయ్యాయి. అధిక పని గంటలు, తీవ్రమైన ఒత్తిడితో పాటు జీతం తక్కువగా ఇవ్వడంతో ఇబ్బంది పడ్డాడు. ఈ విషయాన్ని తన తల్లి మంగకు ఫోన్‌లో తెలియజేశాడు. దీంతో ఆమె కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను ఆశ్రయించింది. తన కుమారుడిని దుబాయ్ నుంచి ఇండియాకు రప్పించాలని కోరింది. అలాగే కలెక్టర్ మహేష్ కుమార్‌కు కూడా ఫిర్యాదు చేయడంతో ఆయన డీఆర్‌ఓ కేంద్రం నోడల్ అధికారి మాధవికి ఆదేశాలు జారీ చేశారు. కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు బాధితుడిని సంప్రదించి, అక్కడి సమస్యను తెలుసుకున్నారు. కనకరాజు ఇబ్బందులు పడుతున్నాడని తెలియడంతో ఇండియాకు తీసుకువచ్చారు.